బీమా..ధీమా

- ఉపాధి శ్రామికులకు బీమా సౌకర్యం
- ప్రమాద లేదా సహజ మరణం చెందితే రూ.2లక్షలు పరిహారం

ఉదయగిరి నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు వివరాలు

మండలం	జాబ్ కార్డులు
ఉదయగిరి	10,249
కలిగిరి	11,808
వింజమూరు	9,946
సీతారామపురం	6,759
దుత్తలూరు	7,238
వరికుంటపాడు	8,345
జలదంకి	9,419
కొండాపురం	11,00


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కలిగిరి: గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం కుటుంబాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవ సాగిస్తున్నాయి. పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. అనారోగ్యం, వడదెబ్బ, విషపురుగుల కాటు, ఇతర ప్రమాదాల కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇలా మృత్యువాత పడిన వారికి శాఖా పరంగా రూ.50వేలు మాత్రమే పరిహారం అందుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఉపాధి కార్మికులకు బీమా చేయించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన అనే రెండు పథకాలను అమల్లోకి తీసుకొచ్చింది. కూలీలు దురదృష్టవశాత్తు మరణించినా.. ప్రమాదం కారణంగా వైకల్యానికి గురైనా బీమా పథకాల ద్వారా రక్షణ పొందవచ్చు.

ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన

18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తిగా వైకల్యానికి గురైనా రూ.2 లక్షలు పరిహారం అందజేస్తారు. పాక్షిక వైకల్యానికి రూ.లక్ష పరిహారం అందుతుంది.

ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన

18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. ఏడాదికి రూ. 436 ప్రీమియం చెల్లించాలి. మరణిస్తే రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ. లక్ష పరిహారం అందజేస్తారు.

బీమా అమలు ఇలా..

ఉపాధి జాబ్ కార్డుదారులందరికీ బీమాను అమలు చేయనున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 74,766 జాబ్ కార్డులు ఉన్నాయి. వేతనదారులకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్ఏ, మేట్లు అందజేసే దరఖాస్తుపై వేతనదారులు సంతకం చేసి ఇస్తే బ్యాంక్ ఖాతాల నుంచి బీమా ప్రీమియాన్ని మినహాయించుకుంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి జాబ్‌కార్డు కలిగిన వేతనదారులందరూ విధిగా బీమా సౌకర్యం పొందాలి. బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం చెల్లింపులు జరుగుతాయి. ఎవరూ నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు. బీమా సౌకర్యాన్ని వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రత్యూషారెడ్డి, ఎంపీడీఓ, కలిగిరి

అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ఉపాధి శ్రామికులకు అవగాహన కల్పిస్తున్నాం. బీమా చేయించుకుంటే ఎంతో లబ్ధి చేకూరుతుంది. కూలీలు కూడా బీమా చేయించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

– కడియం ఉమామహేష్, ఏపీఓ, కలిగిరి

క్లుప్తంగా

ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌గా మురళీధర్



సంగం: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌గా బీ మురళీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరులో విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా సంగం వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కే ఏడుకొండలు నెల్లూరులోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలకు బదిలీ అయ్యారు. నూతన ప్రిన్సిపల్‌ను బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్ ఏడుకొండలు శాలువాతో సత్కరించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరురూరల్: మండల తహసీల్దార్‌గా పీ పద్మజాకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ స్వరూప్, ఆర్ఐ కొండయ్య, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్డీఓ భూమిరెడ్డి పావనిని నూతన తహసీల్దార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉదయగిరి ఏఎంసీ కార్యాలయంలో చోరీ

ఉదయగిరి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కిటికీని ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించిన దొంగలు రెండు కంప్యూటర్లు, వాటికి సంబంధించిన సామగ్రి, రెండు ఫ్లెక్స్ బాక్సులను చోరీ చేశారు. బుధవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది చోరీని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సూపర్‌వైజర్ ఎడ్విన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు విద్యార్థుల బస్సుపాస్‌ల జారీ నిలిపివేత

కావలి (జలదంకి): కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో గురు, శుక్రవారాల్లో విద్యార్థుల బస్సు పాస్‌ల జారీని నిలిపివేస్తున్నామని కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి నూతన పాస్‌వర్డ్‌ను డౌన్‌లోడ్ చేస్తున్నందున రెండ్రోజుల పాటు సేవలు నిలిపివేస్తున్నామని చెప్పారు. 14వ తేదీ నుంచి విద్యార్థులకు యథావిధిగా బస్సుపాస్‌లు జారీ చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



అల్లూరు: స్థానిక గీతాశ్రమంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసాను 108 సార్లు పఠించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఇంటర్ విద్యార్థినికి ప్రతిభా అవార్డు



వరికుంటపాడు: ఉదయగిరిలోని ఏఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన తోట చెరువుపల్లికి చెందిన బద్దాల శృతి 928 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. మంగళవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్న శృతికి అధ్యాపకులతో పాటు స్నేహితులు అభినందనలు తెలిపారు.

సతీష్‌రెడ్డికి అభినందనలు



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలానికి చెందిన డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి జాతీయ భద్రతా మండలి సలహా సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఆత్మకూరు బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు. బుధవారం విజయవాడలో సతీష్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. ఆత్మకూరు ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, బీజేపీ నేత కే నాగరాజారెడ్డి, స్వర్ణభారత్ డైరెక్టర్ సుబ్బానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మ గ్రామోత్సవం



కొండాపురం : మండలంలోని గొట్టిగొండాలలో జరుగుతున్న కోట అంకమ్మ తిరునాళ్లలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి నక్క వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువు దీర్చి విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా గురువారం పెద్ద ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు సంబంధించి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పెంచలరావు అధ్యక్షతన నిర్వహించిన ఎస్‌డబ్ల్యూఎఫ్ 14వ మహాసభలో డిపో గౌరవాధ్యక్షుడుగా షేక్ మహమ్మద్‌ఆలీ, అధ్యక్షుడిగా భాస్కర్, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా చెన్నయ్యను ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారి ఎంసీ నరసింహులుతో పాటు 21 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కార్యదర్శి ఖాజావలీ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం, రీజియన్ అధ్యక్షుడు రాజశేఖర్, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి శివయ్య, మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వక్త

లారీని ఢీకొన్న వ్యాన్

- వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల వద్ద జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున లారీని వెనుక వైపుగా వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. విజయవాడ నుంచి చెన్నైకు రొయ్యల లోడుతో వేగంగా వెళ్తున్న వ్యాన్ ఉలవపాళ్ల పెట్రోల్ బంకు సమీపంలో అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని వెనక వైపుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందుభాగంగా నుజ్జునుజ్జు కాగా విజయవాడకు చెందిన వ్యాన్ డ్రైవర్ వేమళ్ల హరి తీవ్రగాయాలతో వాహనంలో ఇరుక్కుపోయారు. హైవే సిబ్బంది, దగదర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలవడంతో హైవే అంబులెన్స్‌లో నెల్లూరు అపోలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.


గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న హైవే సిబ్బంది

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాజాషరీఫ్

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరులోని ఉలవదిబ్బకు చెందిన షేక్ ఖాజాషరీఫ్ స్కూటీపై కరటంపాడుకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దర్గా సమీపంలో స్కూటర్ చైన్ తెగిపోవడంతో అదుపుతప్పి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి డీసీపల్లి టోల్‌ప్లాజా అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రుడ్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బైక్ అదుపుతప్పి తండ్రికుమారులకు..

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు, కలిగిరి మండలాల సరిహద్దులో బొమ్మరాజుచెరువు సమీపంలో బుధవారం బైక్ అదుపుతప్పిన ఘటనలో తండ్రికుమారులు గాయాలపాలయ్యారు. వివరాలు..కడపకు చెందిన తిరుపతయ్య తన ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై అద్దంకికి బయల్దేరాడు. బొమ్మరాజుచెరువు సమీపంలో బైక్ అదుపుతప్పడంతో తిరుపతయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుమారులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో వింజమూరు సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. కలిగిరి ఎస్సై ఉమాశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన తిరుపతయ్య

ఆర్థిక సాయం

సీతారామపురం: స్థానిక రజక కాలనీకి చెందిన మాచర్ల వెంకటమ్మకు జనసేన నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. గత కొంత కాలంగా బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న వెంకటమ్మకు ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకుడు భోగినేని కాశీరావు సహకారంతో మండల నాయకులు భోగినేని సులోచనమ్మ, భోగినేని కాశీరత్తయ్య రూ.10వేలు నగదు అందజేశారు.

సోమశిల జలాశయాన్ని పరిశీలించిన ఎస్‌ఈ

సోమశిల: సోమశిల జలాశయాన్ని ఎస్‌ఈ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఇటీవల జలాశయం వద్దకు చేరిన కొత్త గేట్ రోపులు, క్రస్ట్‌గేట్లు, ఉత్తర, దక్షిణ కాలువలు, ఆప్రాన్, నీటి మట్టాన్ని పరిశీలించారు. దక్షిణ కాలువ ఆయకట్టు రైతులు సరిపడా సాగునీరు అందడం లేదని ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఈ వచ్చి నీటిమట్టాన్ని పరిశీలించారని సమాచారం. ఆయన వెంట ఈఈ శ్రీనివాస్,జేఈఈ నిఖిల్ ఉన్నారు.

కలిగిరిలో 401 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 401 బేళ్లను విక్రయించారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 568 బేళ్లను వేలానికి తీసుకురాగా, 401 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 167 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280, కనిష్ఠంగా రూ. 180, సగటున రూ. 233.31 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి నివేశ్‌పాండే తెలిపారు.

డీసీపల్లిలో 574 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 574 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 819 బేళ్లు రాగా, 574 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.180, సగటున రూ.228.55 ధర పలికిందని వివరించారు.

యోగా పోటీల్లో ప్రతిభ



కలిగిరి: సిద్ధనకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని బలిజేపల్లి భోగిని జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీల్లో సత్తా చాటిందని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి బుధవారం తెలిపారు. 10 నుంచి 18 ఏళ్లలోపు మహిళల విభాగంలో భోగిని ఆసనాలు, ప్రాణాయామాలు, సూర్యనమస్కారాల పోటీల్లో రాణించి తృతీయ స్థానంలో నిలిచిందని వివరించారు. యోగా శిక్షకులు ఎం శ్రీకాంత్, పీ లలితకుమారి పాల్గొన్నారు.

వైభవంగా అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు

ఉదయగిరి రూరల్: గన్నేపల్లి పంచాయతీలో అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నాల్గోరోజు బుధవారం అమ్మవారికి పసుపు కుంకుమ బండ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ, పేరంటాలమ్మనగర్‌కు చెందిన భక్తులు బండ్లు కట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం పసుపు కుంకుమను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు మహిళలు సంతానం కోసం వరపడ్డారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కాగా అడవి పేరంటాలు అమ్మవారికి కొట్టాలపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రత్నమ్మ దంపతులు రూ.2 లక్షల విలువ చేసే బంగారు నగలను బహూకరించారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి (జలదంకి): బోగోలు మండలం కడనూతలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నాటకరాణి బాబు, మన్నేపల్లి రజనీపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి దాడికి పాల్పడడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బుధవారం కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను కావలి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం ప్రన్నాంజనేయులు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు, నాయకులు నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, ఏగూరి చినపుల్లయ్య, దయాకర్‌రెడ్డి, కుందుర్తి కామయ్య, ఆత్మకూరి రాజేష్, పేరం నాగరాజు తదితరులు పరామర్శించారు. అలాగే కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


బాబును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు

ఆత్మకూరురూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఆత్మకూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికల తయారీపై అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిప్రభుత్వ శాఖ సమగ్ర కార్యాచరణతో నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, డీఎస్పీ వేణుగోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు, ఆరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఇరిగేషన్, విద్యుత్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఆనం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరురూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని నువ్వూరుపాడు దళితవాడలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఎస్సై జిలానీ పాల్గొని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానాస్పద, కొత్త వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. నేరనియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

సోమశిల: అనంతసాగరానికి చెందిన ఏసీ మెకానిక్ షేక్ హమీద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పీఎంజేజేబీవై కింద మంజూరైన రూ.2 లక్షల నగదు చెక్కును కుటుంబ సభ్యులకు కెనరా బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం అందజేశారు.

రైతుల జాబితా విడుదల

సీతారామపురం : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన అర్హులైన రైతుల జాబితా విడుదలైందని ఏఓ చెన్నారెడ్డి బుధవారం తెలిపారు. మండలానికి సంబంధించి 2600 మంది అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. వీరంతా ఆధార్ కార్డులతో రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కర్షకుల పండగ ఏరువాక పౌర్ణమి

ఆత్మకూరురూరల్: ఏరువాక పౌర్ణమి కర్షకుల పండగని జిల్లా వ్యవసాయ అధికారిణి పీ సత్యవాణి పేర్కొన్నారు. మండలంలోని రావులకొల్లులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ఎద్దులతో పొలం దున్ని విత్తనాలు చల్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి నాడు సాగును ప్రారంభిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు,, భూసార పరీక్షల ఆధారంగా జింక్, జిప్సంను సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి విశిష్టతను వివరించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కేతా విజయభాస్కర్‌రెడ్డి , రైతు నాయకులు రామిరెడ్డి మోహన్‌రెడ్డి, పెంచలచౌదరి, చంద్రారెడ్డి, ఏడీఏలు సర్వోజీరావు, శేషగిరిరావు, మారుతీదేవి, ఏఓలు కిశోర్‌బాబు, రజనీకుమారి, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: డీసీపల్లిలో పొగాకు వేలం కేంద్రం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన దామా సుబ్బారావు పంట పొలంలో డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల జనార్దన్‌నాయుడు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి కాడెద్దులతో అరక దున్ని ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ డీసీపల్లిలో పొగాకు వేలం కేంద్రం వచ్చే ఏడాది జనవరి నాటికి 50 వసంతాలు పూర్తి చేసుకోనుందని తెలిపారు. పొగాకు బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఏడాది తొలిసారిగా డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పొగాకు రైతులకు అవసరమైన సహాయ సహకారాలను బోర్డు ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పొగాకు బోర్డు ఫీల్డ్‌అధికారి ప్రకాష్, రాచాల పెంచలయ్య, వెంగళరెడ్డి, వెంకటకొండారెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, మన్నెం బ్రహ్మారెడ్డి, సత్యంబాబు, కాపా నాగయ్య, ఐటీసీ, జీటీ, డెక్కన్ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


ఆత్మకూరురూరల్: ఏరువాకను ప్రారంభించిన జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి


కలిగిరి: పొలంలో నవధాన్యాలు చల్లుతున్న రైతులు, అధికారులు


మర్రిపాడు:డీసీపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కలిగిరి: మండలంలోని పెద్దపాడులో కలిగిరి పొగాకుబోర్డు ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి నివేశ్‌పాండే మాట్లాడుతూ రైతులకు ఏరువాక పౌర్ణమి పండగ ప్రత్యేకమైందన్నారు. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. అనంతరం ఐదుగురు రైతులకు నవధాన్యాలు అందజేసి పొలంలో చల్లించారు. పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.